క్లుప్తంగా

మైనర్ల చేతికి వాహనాలు ఇస్తే కఠిన చర్యలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు

ఉరవకొండ: మైనర్ల చేతికి ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు ఇతర వాహనాలు నడపడానికి ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉరవకొండ ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు హెచ్చరించారు. బుధవారం రేణుమాకుపల్లిలో గ్రామస్తులకు రోడ్డు ప్రమాదాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీల నివారణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో అత్యధికంగా ట్రాన్స్‌ఫార్మర్లు చోరీలకు గురవుతున్నాయని, వీటిపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ఎక్కరాదని దీని వల్ల పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆటో డ్రైవర్లు రోడ్డు నియమాలు పాటించాలని సూచించారు.

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

ఉరవకొండ: అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న కర్నూలు జిల్లా హుసేనాపురం గ్రామానికి చెందిన కౌలు రైతు బోయరాముడు(50) కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర నేత పెద్దముస్టూరు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కౌలురైతు 2 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని కొన్నేళ్లుగా పంటలు సాగుచేసేవాడని, పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు రూ.8 లక్షలు వరకూ అయ్యాయని పేర్కొన్నారు. అప్పులు తీర్చేమార్గం లేక విష గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలురైతు కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

కుడికాలువకు నీటి సరఫరా పెంపు



కుడికాలువలో ప్రవహిస్తున్న పీఏబీఆర్ నీరు

కూడేరు: పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్) నుంచి బుధవారం 650 క్యూసెక్కులకు పెంచి కుడికాలువకు నీటిని సరఫరా చేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కుడికాలువ ధర్మవరం నియోజక వర్గం తాడిమర్రి మండలం అగ్రహారం చెరువు వరకు 112 కిలో మీటర్లు దూరం ఉంది. అగ్రహారం చెరువులోకి పీఏబీఆర్ నీరు చేరుతోంది. అక్కడి నుంచి చెరువులు నింపుకుంటూ వస్తామని అధికారులు వెల్లడించారు.


రైతు దినోత్సవాన్ని జయప్రదం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న సీఐ గౌస్, ఓబులేసు

ఉరవకొండ: ఈనెల 23న జైకిసాన్ ఫౌండేషన్ అధ్వర్యంలో నిర్వహించే జాతీయ రైతు దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు కోరారు. బుధవారం రూరల్ సీఐ సయ్యద్ చిన్నగౌస్ రైతు దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రైతుల పేరిట దినోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. నాగమల్లి ఓబులేసు మాట్లాడుతూ ఈనెల 23న ఉరవకొండ బైపాస్ నుంచి ఉరగాద్రి కల్యాణ మండపం వరకు రైతులతో ర్యాలీ, ఆదర్శ రైతులకు పురస్కారాలు, రైతుల కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యశిబిరం, విశ్రాంత నిరుపేద రైతులకు వస్త్ర వితరణ నిర్వహిస్తామన్నారు.

సన్మార్గంలో నడిపించడమే క్రిస్మస్ ఉద్దేశం



సెమీ క్రిస్మస్ వేడుకల్లో నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: మానవులను సన్మార్గంలో నడిపించడమే క్రిస్మస్ ఉద్దేశమని ఏపీ పీడీటీఈపీఎఫ్ అధ్యక్షుడు శ్యాంకుమార్ పేర్కొన్నారు. ఉరవకొండ డిపో వద్ద ఉన్న షాలోమ్ క్రిస్టియన్ అసెంబ్లీ చర్చిలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు పీడీటీఈపీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షుడు శ్యాంకుమార్ సెమీ క్రిస్మస్ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మనిషి ఇరుగుపొరుగు వారికి చేతనయినంత సాయం చేయాలన్నారు. తనతో పాటు తన పొరుగు వారిని ప్రేమించాలన్నదే క్రిస్మస్ సందేశామన్నారు. పీడీటీఈపీఎఫ్ కార్యదర్శి అంకరాజు, కమిటీ సభ్యులు రెవరెండ్ బాబ్జి, రెవరెండ్ రమేష్, పాల్‌కుమార్, నాగరాజు, లిడియమ్మ, సునీల్, ఎంఎస్ రాజు కృపాకర్, సుబ్రమణ్యం, ఆంజనేయులు పాల్గొన్నారు.

పట్టుకోండి చూద్దాం!



- పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు
- ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేస్తున్న వైనం
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం నియోజకవర్గంలో దొంగలు రెచ్చిపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, ఆలయాల్లో హుండీ కానుకలు.. ఇలా ఒకటేమిటి దొరికిన కాడిల్లా దోచుకెళ్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. మరోవైపు వరుస ఘటనలతో నియోజకవర్గ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఓ వైపు ఆలయాలు... మరో వైపు ట్రాన్స్‌ఫార్మర్లు

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఓ వైపు ఆలయాలు. మరో వైపు ట్రాన్స్‌ఫార్ల పై దొంగలు టార్గెట్ పెట్టారు. కొత్త తరహాలో ఓ రాత్రి ఆలయాలు టార్గెట్ చేస్తే మరో రాత్రి ట్రాన్స్‌ఫార్మర్లపై దృష్టి పెడుతూ చోరీలకు పాల్పడుతున్నారు. రూ.వేలుఖర్చు చేసి వ్యవసాయ పొలాల్లో ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని రాగి తీగలను దుండగులు ఎత్తుకెళ్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో రాగి కడ్డీ విలువ రూ.900 నుంచి రూ.1000 పలుకుతుండటంతో ఇదే అదనుగా చోరీలకు పాల్పడుతున్నారు. గతంలో కేవలం తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్ చేసిన దుండగులు కొత్తగా ఈ తరహా దొంగతనాలకు పాల్పడుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

ఆందోళనలో అన్నదాతలు

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. అష్టకష్టాలు పడి ఆరుగాలం కష్టించి పంటలు సాగు చేసుకున్న రైతులు ఒక్కసారిగా ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలతో హడలెత్తిపోతున్నారు. ఉన్న ఫలంగా విద్యుత్ సరఫరా కాకపోతే పంటలకు నీరు లేక పంటలు ఎండిపోయే ప్రమాదంలో రైతులు పడ్డారు. ముఖ్యంగా రబీలో వేరుశనగ, మొక్కజొన్న, అరటి, టమాట వంటి వాణిజ్య పంటలను రైతన్నలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసిన రైతుల పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తే తమ లాంటి వారి పరిస్థితి ఏంటని పలువురు రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బోరంపల్లిలో రైతు కురుబ పాతూరప్ప తోటలో ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

త్వరలోనే దొంగలను పట్టుకుంటాం

ఇటీవల దొంగలు కొత్త పంథాను ఎంచుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్‌ను ఎత్తుకెళ్తున్నారు. చోరీలపై ఫిర్యాదులు అందిన వెంటనే దుండగులను పట్టుకునేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఉంచాం. ప్రతి గ్రామానికి గ్రామ పోలీసును ఏర్పాటు చేసి చోరీలపై అప్రమత్తం చేశాం. దీనికి తోడు వ్యవసాయ పొలాల్లో రైతులు సమష్టిగా ఉండి గుర్తు తెలియని వ్యక్తులపై నిఘా ఉంచాలి. అనుమానస్పదంగా ఎవ్వరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

– వంశీకృష్ణ, రూరల్ సీఐ, కళ్యాణదుర్గం

నియోజకవర్గంలో చోరీలు మచ్చుకు కొన్ని ...

- ఏప్రిల్ 30న కళ్యాణదుర్గం మండలం కామక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో సబ్ మెర్సిబుల్ మోటార్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు.
- మే 15న కళ్యాణదుర్గం నియోజకవర్గానికి తలమానికంగా మారిన అక్కమాంబ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీలను పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. హుండీల్లో దాదాపు రూ.3 లక్షలకు పైగా నగదు ఉంటుందని అంచనా.
- ఇదే నెలలో కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి సమీపంలో ఓ వ్యవసాయ తోటలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగి వైరును ఎత్తుకెళ్లారు.
- రెండు రోజుల క్రితం కళ్యాణదుర్గం మండలం యర్రంపల్లికి చెందిన ఓ రైతు పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి లోపలి వైపు ఉన్న రాగి వైరును ఎత్తుకెళ్లారు.
- దురదకుంట, భట్టువానిపల్లిలో జూలై నెలలో రెండు చోట్ల దుండగలులు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి వైరును తస్కరించారు.
- కుందుర్పి మండలం రుద్రంపల్లిలో పురాతన శివాలయంలో హుండీను పగులగొట్టి గుర్తు తెలియని దుండగులు నగదును ఎత్తుకెళ్లారు. హుండీల్లో సుమారు రూ.40 వేలు వరకు ఉంటుందని గ్రామస్తుల అంచనా.
- డిసెంబర్ 8న కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి కాపర్ వైరును ఎత్తుకెళ్లారు.
- ఇది జరిగిన రెండు రోజుల తర్వాత మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లులో సైతం ఓ రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి కాపర్‌ను ఎత్తుకెళ్లారు.
- డిసెంబర్ 18న బోరంపల్లిలోని కురబ పాతూరప్ప అనే రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై దుండగుల కన్ను పడింది. రాత్రికి రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్‌ను ఎత్తుకెళ్లారు.

భూ సమస్యలు పరిష్కరించండి

సెట్టూరు: భూ సమస్యలు పరిష్కరించాలని పలువురు రైతులు అధికారులను కోరారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రీసర్వే అధికారుల నిర్లక్ష్యం వల్ల తమ భూమి 10 సెంట్ల నుంచి అర్ధ ఎకరం వరకు భూములు తగ్గాయన్నారు. భూములు జాయింట్ ఎల్‌పీఎంలో పడ్డాయని, వాటికి పస్‌బీలు రావడం లేదన్నారు. వాటిని సబ్ డివిజన్ చేసుకోవాడం భారంగా మారిందన్నారు. జాయింట్ ఎల్‌పీఎంలో ఉన్న భూములను సరిచేయమని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. సర్పంచ్ కుమార్, మాజీ సర్పంచ్‌లు వీరభద్రప్ప, రామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గురుప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : గ్రామాల్లోని భూ సమస్యల పరిష్కరం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుమతి తెలిపారు. బుధవారం సంతేకొండాపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల్లో సంతేకొండాపురం రెవెన్యూ పొలంలో భూ సమస్యలై 39 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆర్‌ఐ నాగిరెడ్డి, వీఆర్వోలు వేణుగోపాల్, నాగరాజు, ఓబుళమ్మ, సర్పంచ్ వనిత తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: రెవెన్యూ సదస్సులో వచ్చే భూ, ఇతర సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతామని డిప్యూటీ తహసీల్దార్ సూర్య ప్రతాప్ తెలిపారు. బుధవారం కలగళ్ల గ్రామంలో అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగాభూ, ఇతర సమస్యలపై 100కు పైగా అర్జీలు వచ్చాయి. వాటిని నిబంధనల మేరకు పరిష్కరిస్తామని డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అయేషా సిద్దిక్, వీఆర్వోలు శంకరనారాయణ, లక్ష్మన్న, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

కుందుర్పి: జంబుగుంపల, ఎనుములదొడ్డి అటవీ ప్రాంత పరిసర ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన అటవీ భూములను స్వాధీనం చేసుకోవాలని ఎంపీపీ కమలమ్మ, ఆయా గ్రామాల సర్పంచులు గంగాధర, విజయ్, వెంకటేష్, రైతులు కోరారు. బుధవారం ఆయా గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. జంబుగుంపల అటవీ ప్రాంతంలోని ముచ్చలగుండ్లు, మారెమ్మకొండ, బెస్తరపల్లి ఆరు బయలు తదితర సరిహద్దు ప్రాంతాల్లో 15 ఎకరాల మేర కొందరు స్వార్థపరులు ఆక్రమించుకున్నారన్నారు. ఎనుములదొడ్డి, కరిగానిపల్లి పరిసర ప్రాంతాల్లో అటవీ భూములు దురాక్రమణకు గురయ్యాయన్నారు. స్పందించిన తహశీల్దార్ శ్రీనివాసులు, అటవీ బీట్ అధికారి పరమేశ్వరప్ప ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తామన్నారు.

కణేకల్లు: గరుడచేడు గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈసందర్భంగా తహసీల్దార్ ఫణికుమార్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన సభలో వచ్చిన వినతుల్లో 35 సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. జాయింట్ ఎల్‌పీఎం సమస్యలపై ఇద్దరు రైతులు అర్జీలు అందించారు. ఆర్ఎస్ డీటీ విజయకుమార్, వీఆర్వో, విలేజ్ సర్వేయర్ పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: ఎస్.హొసళ్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో మూడు వినతులు అందినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ ఈరన్న, ఎంపీడీఓ రామకృష్ణ, డీటీ రఘు, ఆర్‌ఐ.రామాంజనేయులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులు వేగవంతం చేయండి

బ్రహ్మసముద్రం : మండలంలో ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని డ్వామా పీడీ సలీంబాషా సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ఉపాధి పథకం సిబ్బందితో సమావేశమై మండంలో అభివృద్ధి పనులపై చర్చించారు. మండలంలోని ప్రతిగ్రామంలో ఉపాధి హామీ కింద అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జాబ్ కార్డు కలిగిని ప్రతి కుటుంబానికి , ప్రతి కూలీకి పనులు కల్పించాలని సూచించారు. మండలానికి కేటాయించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఏపీఓ పండరీష్, ఈసీ జయప్రకాష్, టెక్నికల్ అసిస్టెంట్లు అవినాష్, మంజునాథ్, బీఎఫ్‌టీ వన్నూర్ స్వామి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ సలీం బాషా

గుమ్మఘట్ట: మండలానికి మంజూరైన 35 పశువుల షెడ్ల పనులను జనవరి 15లోగా పూర్తి చేయాలని డ్వామా పీడీ సలీంబాషా సిబ్బందిని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి కూలికి పని కల్పించాల్సిన బాధ్యత అందరిపై వుందన్నారు. పండ్లతోటల పెంపకంలో రైతులకు ఇస్తున్న రాయితీలపై అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఓ సురేష్, టెక్నికల్ అసిస్టెంట్లు సర్మస్, కృపాల్, దేవమ్మ,లావణ్య,రామాంజనేయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

బొమ్మనహాళ్: ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కళ్యాణదుర్గం ఆర్డీవో వసంతబాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం ఎంత మొత్తంలో వస్తోంది, తేమ ఏ విధంగా ఉంది, సీరియల్ క్రమంలో తూకం వేస్తున్నారా లేదా అని పరిశీలించారు. అలాగే ధాన్యాన్ని తీసుకొని దాని మ్యాచర్ వచ్చిన వెంటనే తూకం వేయాలని తర్వాత తూకం వేసిన ధాన్యం బస్తాలను అలాట్ అయిన రైస్ మిల్లులకు పంపించాన్నారు. టెక్నీషియన్‌ను పిలిచి ట్యాబ్ డేటా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, రిజిస్టర్‌లో వరిధాన్యం కుప్పలకు సీరియల్ క్రమంలో ఎంట్రీ చేయాలని తెలిపారు. తూకం విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు వహించాలని ఆర్డీఓ అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయనున్నట్లు ఆర్డీఓ విలేకరులకు తెలిపారు. రైతులు తెచ్చే ధ్యానాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ధాన్యం తూకంలో జాప్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ మునివేలు, ఏఓ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్దేహాళ్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వసంతబాబు

రాజకీయాలకు అతీతంగా పనులు కల్పించండి

కుందుర్పి: గ్రామాల్లో ఉపాధి హామీ సిబ్బంది రాజకీయాలకు అతీతంగా గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీఓ లక్ష్మీశంకర్, ఏపీఓ రవీంద్ర సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పలు పంచాయతీల్లో రాజకీయాల పేరుతో పనుల కల్పనలోనే వివక్ష చూపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, కూలీలకు పనులు కల్పించే విషయంలో నిబద్ధతతో పని చేయాలన్నారు. మలయనూరు, జంబుగుంపల, ఎర్రగుంట, కరిగానిపల్లి తదితర పంచాయతీల్లో డ్రైల్యాండ్ హార్టికల్చర్ పెంపకంలో సిబ్బంది ఏకపక్షంగా పండ్ల మొక్కలు మంజూరు చేసినట్లు పలువురు చిన్నసన్నకారు రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈసీ శర్మాస్ వలి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మధ్యంతర భృతిని వెంటనే ప్రటించాలి

బొమ్మనహాళ్: ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఎస్‌టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శులు బి. సుర్యుడు, బాబ్జి నాయక్, రామాంజినేయులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్‌టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ 2023 జూలై నుంచి అమలు కావాల్సి ఉందన్నారు. పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసి కమిషన్ రిపోర్టు ప్రభుత్వానికి నివేదించి పీఆర్‌సీ ప్రకటించడానికి చాలా సమయం పడుతుందని, ఆ లోపు 30 శాతం మధ్యతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ తదితర పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధ్యాయులకు యాప్లను తొలగించి బోధనేతర పనులు నుంచి మినహాయించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతను తీర్చడానికి వెంటనే పదోన్నతులు కల్పించాలని కోరారు. ఎస్‌టీయూ మండల నాయకులు నాగేంద్ర, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న ఎస్‌టీయూ నాయకులు

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ట

వజ్రకరూరు: పందికుంట గ్రామంలో బుధవారం బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు తమ ఆడపడుచులకు ఒడిబియ్యం కార్యక్రమం చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనాలు తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణ నెలకొంది.



బొడ్రాయిని ప్రతిష్టిస్తున్న దృశ్యం

సంక్షిప్త సమాచారం

ఎన్‌హెచ్‌ఆర్‌పీఎఫ్ రాయలసీమ జోనల్ సెక్రటరీగా ఈశ్వరయ్య



రాయదుర్గంటౌన్: జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ(ఎన్‌హెచ్‌ఆర్‌పీఎఫ్) రాయలసీమ జోనల్ సెక్రటరీగా పట్టణానికి చెందిన కావాలి ఈశ్వరప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌పీఎఫ్ అనంతపురం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న ఈశ్వరప్పకు రాయలసీమ జోనల్ సెక్రటరీగా రాష్ట్ర కమిటీ ప్రతినిధులు బాధ్యత అప్పగించినట్లు ఈశ్వరప్ప తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

గుమ్మఘట్ట : మండల కేంద్రంలో ముగ్గురిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన ఉప్పర తిప్పేస్వామి, ఉప్పర రాజశేఖర్, బోయ తిరుమలేష్ బుధవారం మాల గంగాధర్‌తో గొడవ పడ్డారు. గంగాధర్‌ను కులంపేరుతో దుర్భాషలాడడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి

బొమ్మనహాళ్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పని చేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీఓ దాస్‌నాయక్, ఈఓఆర్‌డీ దాస్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, ఇంజినీరింగ్, వెల్ఫేర్, మహిళా పోలీస్, సర్వేయర్లతో సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల స్థిరీకరణ అనే అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు సాధించడంపై దృష్టి పెట్టాలన్నారు. ఇందుకోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీరు, మహిళా సాధికారత, చిన్నారుల భద్రత, నీటి వనరులను సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

21న జాబ్‌మేళా

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. తెలిపారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్, ఫ్లిప్‌కార్ట్ ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి వారు సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూలకు హాజరవుకావాలని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 9182920381 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నకిలీ ఎరువులు, పురుగుమందులను నియంత్రించండి

కుందుర్పి: మండల కేంద్రంలో ఎరువుల దుకాణాల్లో 3 నెలలుగా నకిలీ ఎరువులు, పురుగుమందుల విక్రయాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని మండల రైతులు నాగరాజు, హరికృష్ణ, ఈరన్న, గోవిందప్ప, నరసింహులు ఆరోపించారు. బుధవారం రైతులు జిల్లా కేంద్రంలోని విజిలెన్స్ అధికారులు, కళ్యాణదుర్గం ఏడీఏ యల్లప్పకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. మండల కేంద్రం కర్ణాటక సరిహద్దున ఉండటంతో అధికారుల తనిఖీలు అంతంత మాత్రంగానే ఉండడంతో కుందుర్పిలో పుట్టగొడుల్లా ఎరువుల దుకాణాలు వెలిశాయన్నారు. కొందరు టీడీపీ మద్దతుదారులైన దుకాణపు యజమానులు బహిరంగంగానే నకిలీ ఎరువులు పురుగుమందులు విక్రయిస్తున్నారన్నారు. ఇటీవల ఓ దుకాణంపై విజిలెన్స్ అధికారులు దాడులు చేసి దుకాణాన్ని సీజ్‌చేయగా గంటల వ్యవధిలోనే దుకాణం తెరిచారని వారు గుర్తు చేశారు.

బీటీ ప్రాజెక్ట్ చైర్మన్ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్

రాయదుర్గం: జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన బైరవానితిప్ప(బీటీపీ) ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికకు బుధవారం జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు ప్రాజెక్ట్ చైర్మన్, మధ్యాహ్నం 3 గంటలకు వైస్ చైర్మన్ ఎన్నిక పూర్తిచేసేలా మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ వివరాలను మైనర్ ఇరిగేషన్ డీఈ బలరాముడు వెల్లడించారు. గుమ్మఘట్ట ఐకేపీ కార్యాలయంలో ఈ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుమ్మఘట్ట మండలంలో నాలుగు డీసీ, బ్రహ్మసముద్రం మండలంలో ఇద్దరు ఏకగ్రీవంగా ఎన్నికైన డబ్ల్యూఏ ప్రెసిడెంట్లలో ఒకరిని కోరం ఆధారంగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక చేస్తామన్నారు. ఆరుగురు డబ్ల్యూఏ ప్రెసిడెంట్లు నిర్ణీత సమయంలోగా ఐకేపీ కార్యాలయం వద్దకు చేరుకోవాలని సూచించారు.

విత్తన వేరుశనగ పంపిణీలో నిర్లక్ష్యం

కుందుర్పి: రబీ సీజన్ దాటిపోతున్నా నేటికీ విత్తన వేరుశెనగ విత్తనం అందించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని రైతు సంఘం మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన రైతు సంఘం నాయకులు లక్ష్మీపతి, హనుమంతప్ప, సుదర్శన్‌రెడ్డి, నాగరాజు, వాల్మీకి మాజీ కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షీ, ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షుడు పీఎస్ తిప్పేస్వామి విలేకర్లతో మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్లు ప్రారంభానికి మునుపే రైతులకు సబ్సిడీ వేరుశనగ, ఇతర విత్తనాలు సకాలంలో అందించేవారన్నారు. ప్రస్తుతం డిసెంబర్ దాటిపోతున్నా సబ్సిడీ విత్తన వేరుశనగ ఊసేలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు విత్తన వేరుశనగ విత్తనాలను అందించాలని వారు కోరారు.

‘సమాచారం అందించినా హాజరుకాలేదు’

వజ్రకరూరు: రూపానాయక్ తండా పంచాయతీలో జరిగే ప్రతి సమావేశానికి వార్డు సభ్యులకు సమాచారం అందించినా హాజరు కాలేదని సర్పంచు కొర్రా శివాజీ నాయక్ అన్నారు. కొందరు వార్డుసభ్యులకు తమకు సమాచారం అందించకుండానే అభివృద్ధి పనులు చేపట్టారంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. దీనిపై బుధవారం డీఎల్‌పీఓ శివాజీరెడ్డి రూపానాయక్‌తాండా రచ్చకట్ట వద్ద విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచు శివాజీనాయక్ మాట్లాడుతూ పంచాయతీలో జరిగే ప్రతి సమావేశానికి ప్రోటోకాల్ ప్రకారం వార్డు సభ్యులకు సమాచారం అందించినా వారు హాజరుకాలేదన్నారు. ఈనేపథ్యంలో ప్రజల శ్రేయస్సును దృష్టిలో పలు తీర్మానాలు చేసి పనులు చేపట్టామన్నారు. ప్రతి పనిని నిబంధనల ప్రకారం రికార్డు చేయించామని, రికార్డు చేసిన పనులకు మాత్రమే ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు డ్రా చేసినట్లు వెల్లడించారు. అనంతరం డీఎల్‌పీఓకు సర్పంచు వినతిపత్రం అందచేశారు. ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి, గ్రామకార్యదర్శి మురళి ,గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



రూపానాయక్‌తండాలో విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ శివాజీరెడ్డి